# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 126 ప్రకాశం, గురువారం 05- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఉన్నం లక్ష్మీ నరసింహంకు నివాళు లుఎమ్మెల్యే సతీమణి ఇంటూరి సౌజన్య




వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి, మండలం లోని పోకూరు గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు ఉన్నం లక్ష్మీనరసింహం దశదినకర్మ కార్యక్రమం బుధవారంజరిగింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన కుమారులు వీరాస్వామి, శరత్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఫిబ్రవరి 9న క్యాంపస్ డ్రైవ్

### సీఐఎస్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు

కావలి క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు కౌంటర్ ప్రతినిధి,విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కావలి పట్టణంలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కాలేజీ మరో కీలక అడుగు వేసింది. ఫిబ్రవరి 9 (సోమవారం) ఉదయం 9 గంటల నుంచి కావలి పట్టణం కో – ఆపరేటివ్ కాలనీ లోని కాలేజ్ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ సీఐఎస్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమ బుధవారం తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు 2023, 2024, 2025 సంవత్సరాల్లో డిగ్రీ మరియు బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు, ప్రస్తుతం 2026 డిగ్రీ ఫైనల్ ఇయర్ మరియు బీటెక్ చదువుతున్న విద్యార్థులు కూడా హాజరుకావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎమ్మెస్సార్ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000660259 (కొండప నాయుడు), 9949856734 (అపర్ణ) నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## గిద్దలూరు సగిలేరు రైల్వే బ్రిడ్జి వద్ద అనుమానాస్పద మృతి



క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా..... గిద్దలూరు పట్టణంలో...లో నంద్యాల రోడ్డులోని సగిలేరు రైల్వే బ్రిడ్జి కింద ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న ఘటన వెలుగులోకి వచ్చింది.ఈరోజు ఉదయం రైల్వే ట్రాక్ తనిఖీ చేస్తూ వెళ్తున్న ట్రాక్‌మన్––కీమెన్ మద్దిలేటి, రైల్వే బ్రిడ్జి కింద ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని స్థానిక రైల్వే పోలీస్ సిబ్బందికి తెలియజేశారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. మృతునికి సంబంధించిన బంధువులు ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాలని వారు కోరారు.....

## ఉద్యోగ "విజేత"లకు సన్మానం



కందుకూరు క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్, పట్టణానికిచెందిన దమ్ము జయసూర్య గ్రూప్–2 పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఎక్సైజ్ సబ్ ఇన్ స్పెక్టర్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. కందుకూరు లో ఒ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఎలాగైనా ప్రభుత్వ ఉ ద్యోగమే లక్ష్యం గా పెట్టుకుని నేడు తన లక్ష్యాన్ని చేరుకున్న జయసూర్య ఎవరో కాదు ఇపుడు బి.ఆర్.అక్స్ ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్స్ గా ఉన్న జి.బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు ల శిష్యుడే.ఇదే విధంగా మరో విద్యార్థిని బిందు యోజిత కష్టపడి చదివి కెనరా బ్యాంకు పి ఓ గా ఉద్యోగం సంపాదించింది. ఈ నేపథ్యంలో వీరిద్దరూ.. ఒకప్పుడు వారి వద్ద చదువుకున్న కృతజ్ఞతా భావంతో ఆప్యాయంగా పలకరించడానికి మంగళవారం కందుకూరు బి.ఆర్ అక్స్ ఫర్డ్ కాలేజ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి కాలేజీ విద్యార్థినీ,విద్యార్థులు,ఉ పాధ్యాయులు ఘనస్వాగతం పలికారు.అనంతరం వారిని ఘనంగా సత్కరించి సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా పయనించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.ఇంటర్ దశలో ఉ న్నపుడు మన పై ఉపాధ్యాయులు కాస్త కఠినంగా వ్యవహరించినప్పటికీ అది మన మంచికే అన్నట్లు విద్యార్థులు ముందుకు పోవాలన్నారు.డైరెక్టర్స్ మాట్లాడుతూ..ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్న మా పూర్వ విద్యార్థుల కి విద్యా బోధన అందించినందుకు మాకు ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు,ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 వెనుకబడిన వర్గాలను కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా , ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ–3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూర్చేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ:ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్.,

జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణకు రోడ్డు సేఫ్టీ టీమ్స్ ఏర్పాటు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

హైవేలపై అతివేగ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక



క్రైమ్ కౌంటర్ న్యూస్.... ప్రకాశం జిల్లా.... రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గుండా వెళ్లే ఏడు జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడానికి ప్రత్యేకంగా రోడ్డు సేఫ్టీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ , తెలిపారు.

జాతీయ రహదారుల వారీగా ఏర్పాటు చేసిన టీమ్స్ వివరాలు ఈ విధంగా ఉన్నాయని చెప్పారు:ఎన్‌హెచ్–16 : 8 టీమ్స్,ఎన్‌హెచ్–216 : 2 టీమ్స్,ఎన్‌హెచ్–544ఉ : 8 టీమ్స్,ఎన్‌హెచ్–565 : 8 టీమ్స్,ఎన్‌హెచ్–765 : 2 టీమ్స్,ఎన్‌హెచ్–340జ : 1 టీమ్,ఎన్‌హెచ్–167డీ : 5 టీమ్స్. ఈ రోడ్డు సేఫ్టీ టీమ్స్‌లో పోలీసులు, చీనా×ఉ 1033 సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, ఆర్టీఏ అధికారులు, అలాగే మెడికల్ ఉ హెల్త్ డిపార్ట్మెంట్ (108 సేవలు) కు సంబంధించిన అధికారులు సభ్యులుగా ఉ ంటారని జిల్లా ఎస్పీ , తెలిపారు.

జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలు, బస్సులు––లారీలు నిలిపే రెస్ట్ ఏరియాలు, ఎమర్జెన్సీ పార్కింగ్ ప్రదేశాలు, అనధికార పార్కింగ్ ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్, సర్వీస్ రోడ్ల నుండి ప్రధాన రహదారికి కలిసే ప్రాంతాలు, అలాగే స్ట్రైట్ గా 5 కిలోమీటర్ వరకు ఉన్న రోడ్డుపై అతివేగ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై మరియు హైవే పై ఉన్న హోటళ్లు, దాబాల వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన వాటి గురించి జిల్లా ఎస్పీ , అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

ఆయా ప్రదేశాలలో సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్, కాన్వెక్స్ మిర్రర్లు,తగినంత లైటింగ్,రంబుల్ స్ట్రిప్స్ (లైన్స్),ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నుండి ప్రధాన రహదారికి కలిసే ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, స్పీడ్ బ్రేకర్లు, ఇల్యూమినేషన్ ఏర్పాటు చేసి, ప్రమాదాలకు అవకాశం లేకుండా తక్షణమే అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా ఎస్పీ , స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు....

## ఆక్వాకల్చర్ రంగానికి అమెరికా నిర్ణయంతో మేలు జరుగుతుంది

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం టారిఫ్‌లను తగ్గించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వాకల్చర్ రంగానికి గణనీయమైన ఊరటనిస్తుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం, ఆక్వా రంగంలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఒక వరం లాంటిదని ఆయన అభివర్ణించారు. దీనివల్ల రాష్ట్రంలోని రైతులు, మత్స్యకారులకు ఆదాయ స్థిరత్వం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గతంలో అధిక టారిఫ్‌ల కారణంగా తగ్గిన ఎగుమతులు మళ్లీ పుంజుకుంటాయని, అమెరికా మార్కెట్లో భారత ఉ త్పత్తుల పోటీతత్వం పెరుగుతుందని అచ్చెన్నాయుడు అన్నారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శుభవార్త..

## మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయాల (స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు) ఉద్యోగులకు శుభవార్త. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారులతో సచివాలయాల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రమోషన్లు, మూడంచెల వ్యవస్థపై అధికారులతో మంత్రి ఈ సందర్భంగా చర్చించారు. ఈ క్రమంలోనే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలపై పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఓ అధికారిని, ప్రతి మండలానికి ఓ ఆఫీసర్‌ను డిప్యూటేషన్ పద్ధతిలో నియమించనున్నట్లు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అందరికీ (స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు) ప్రమోషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

సచివాలయాల సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్నామన్న మంత్రి... ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. మార్చిలోపు వీటిని భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు, మూడు చక్రాల మోటార్ బైకుల పంపిణీ విషయాలపై చర్చించారు.

అలాగే దివ్యాంగ పాఠశాలల్లో చేరికలు, వయోవృద్ధులకు అందించే వయో వందన ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీపైనా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చర్చించారు. ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డుల జారీతో పాటుగా నైపుణ్య శిక్షణ వంటి అంశాలపై సమీక్షించారు. దివ్యాంగ పాఠశాలల్లో అడ్మిషన్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. దివ్యాంగ పాఠశాలల్లో వందశాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏవైనా మరమ్మతులు ఉంటే పూర్తి చేయాలని.. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు అందించే ఆహారం మెనూ అమలులో రాజీ వద్దని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. మరోవైపు దివ్యాంగులకు ప్రభుత్వం త్రీవీలర్ మోటార్ సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేయనున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. వయో వృద్ధులకు అందించే సహాయ పరికరాలు ఎక్కువ మందికి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# మహానందిలో మహాశివరాత్రి వేడుకలు.. భక్తుల కోసం దేవస్థానం కీలక నిర్ణయం

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 ప్రముఖ శైవక్షేత్రం మహానంది మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమవుతోంది. మహాశివరాత్రి సందర్భంగా మహానందిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బ్రహ్మోత్సవాల సమయంలో మహానంది ఆలయంలో స్పర్శ దర్శనం, అభిషేకాలు, ఆర్జిత సేవలు రద్దు చేశారు.

ఈ విషయాన్ని మహానంది దేవస్థానం ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజులలో స్పర్శ దర్శనం, ఆర్జిత సేవలు నిలుపుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. అలాగే రుద్రగుండం పుష్కరిణిలోనూ భక్తులకు స్నానాలకు అనుమతి లేదని వెల్లడించారు.

మరోవైపు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మహానంది దేవస్థానం ఈవో వివరించారు. బుధవారం రోజున మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రిక, వాల్ పోస్టర్లను ఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈవో శ్రీనివాస రెడ్డి.. ఫిబ్రవరి 11న కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి.. నంద్యాలలోని బ్రహ్మనందీశ్వర స్వామి అమ్మవార్లను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు వెళ్తారని వివరించారు. మహానంది ఆలయానికి ఫిబ్రవరి12న తిరిగి చేరుకుంటారని.. ఫిబ్రవరి 13వ తేదీ సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఫిబ్రవరి 13వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 14వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం,



సాయంత్రం సింహ వాహనంపైనా గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదీ మహాశివరాత్రి జాగరణ ఉంటుందని ఈవో వెల్లడించారు. ఈ సందర్భంగా రాత్రి పది గంటల నుంచి లింగోద్భావకాలంలో మహా రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు.

అదేవిధంగా తెల్లవారుజామున మూడు గంటలకు కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మహానంది ఆలయం ఈవో వివరించారు. ఫిబ్రవరి16వ తేదీ ఉదయం నుంచి దీక్షా హోమాలు ఉంటాయని.. రాత్రి పుష్ప పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 17న మధ్యాహ్నం మూడు గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి18న ధ్వజావరోహణం, శివ దీక్ష విరమణ, మహా పూర్ణాహుతి కార్యక్రమాలతో పాటుగా రాత్రికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు మహానంది దేవస్థానం అధికారులు వెల్లడించారు.

# రాహుల్ గాంధీకి సవాల్ విసిరిన నిర్మలా సీతారామన్



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 బడ్జెట్ 2026 గురించి చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ మాట్లాడుతూ... సమగ్రంగా లేదని వ్యాఖ్యానించారు. దీనిపై నిర్మలమ్మ స్పందిస్తూ.. ప్రతిపక్ష నేత చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలను నిరూపించే అంశాలను రాహుల్ గాంధీ తన ముందు నిలబడి చెప్పగలరా? అని నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలను కాంగ్రెస్ నేత చూపించాలని ఆమె డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలపై ప్రధానంగా దృష్టి సారించిందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న లేబర్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువత కోసం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్ సమగ్రంగా లేదని, దేశం ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్లు, సంక్షోభాలపై దృష్టి సారించలేకపోయిందని రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. యువతకు ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారని, తయారీ రంగం పతనమవుతోందని కాంగ్రెస్ అగ్రనేత ఆరోపించారు. వ్యాపారవేత్తలు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారని అన్నారు. రైతాంగం ఇబ్బందులు, అంతర్జాతీయంగా తగులుతోన్న ఎదురు దెబ్బలు వంటి విషయాలను ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కేంద్రంలోని మోదీ సర్కారు మాత్రం ఇది యువశక్తిపై ఫోకస్ పెట్టే బడ్జెట్ అని, 20247 వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోడానికి మార్గాన్ని ఇస్తుందని పేర్కొంటోంది.

# టారిఫ్ తగ్గింపుతో రాష్ట్రానికి ఉపశమనం: అచ్చెన్న

క్రైం కౌంటర్ న్యూస్ , అమరావతి, ఫిబ్రవరి 4 భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా విధించిన టారిఫ్‌ను25 నుంచి 18శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నట్లు మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. టారిఫ్ తగ్గింపు వల్ల రాష్ట్రం నుంచి సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి పెద్ద ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. టారిఫ్ తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పెరిగి, ఏపీ మత్స్య, ఆక్వా రంగం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి అచ్చెన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



# జనసేన కమిటీ ముందుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

## లైంగిక ఆరోపణలపై 2 విడతలుగా విచారణ

## చట్టపరంగా పోరాడతా : ఎమ్మెల్యే



క్రైం కౌంటర్ న్యూస్ : తిరుపతి, ఫిబ్రవరి 4 ఓ మహిళా ఉద్యోగి చేసిన లైంగిక ఆరోపణలకు సంబంధించి.. జనసేన నియమించిన విచారణ కమిటీ తమ పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను మంగళవారం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో విచారించింది. 45 మంది పార్టీ కార్యకర్తలను కూడా పిలిపించి వివరాలు సేకరించింది. రైల్వే కోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఇసకపట్ల హర్షవీణ ఇటీవల ఎమ్మెల్యే శ్రీధర్‌పై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన జనసేన ఎమ్మెల్యే కావడంతో తక్షణమే స్పందించిన ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన నేత సొక్కం రమాదేవి, అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్‌తో కూడిన కమిటీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రైల్వేకోడూరు చేరుకుంది. తొలుత ఎమ్మెల్యేను విచారించింది. తర్వాత జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రను, 45 మంది కార్యకర్తలను విచారించింది. మెజారిటీ కార్యకర్తలు ఎమ్మెల్యేపై ఆరోపణల సంగతి పక్కనపెట్టి.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగాలేదని తెలిపినట్టు సమాచారం. సాయంత్రం 5.30 గంటల సమయంలో కమిటీ సభ్యులు మరో విడత ఎమ్మెల్యే శ్రీధర్‌ను పిలిచి విచారించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని..దానిపై నివేదిక రూపొందించి అధిష్ఠానానికి అందజేస్తామని టీసీ వరుణ్ మీడియాకు చెప్పారు. మహిళా ఉద్యోగి ఆరోపణలు తన వ్యక్తిగత సమస్య అని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని శ్రీధర్ మీడియాకు తెలిపారు. చట్టపరంగా పోరాడతానని తెలిపారు. కాగా, అరవ శ్రీధర్‌పై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదుచేశారు.

బొలిశెట్టి రాజీనామా

జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ పార్టీ నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నట్లు వెల్లడించారు. జల బిరాదరి జాతీయ కన్వీనర్‌గా ఉన్న తాను.. ఉత్తరాంధ్రలోని కాలుష్య సమస్యలపై 2020లో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశానని.. ఇప్పుడు అదే పర్యావరణ శాఖకు పవన్ కల్యాణ్ మంత్రిగా ఉండడం వల్ల నైతిక ఇబ్బందులు కలగకూడదనే ఆలోచనతో రాజీనామా చేశానని చెప్పారు.

# రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

## బడ్జెట్‌లో వేతనాల పెంపు ప్రస్తావన లేకపోవడంపై ఆగ్రహం

## రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04 కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంగన్‌వాడీ వేతనాల పెంపుదల గురించి లేకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లాల్లోని సీడీపీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం బడ్జెట్‌లో అన్యాయం చేసిందంటూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడలో ఆందోళన నిర్వహించారు. కానూరులోని ఐసీడీఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రూరల్ సీడీపీవో భానుమతి, అర్బన్ సీడీపీవో జ్యోత్స్నకు వినతిపత్రాలు అందజేశారు. ఏలూరు జిల్లాలోని పది సీడీపీవో కార్యాలయాల ఆందోళనలు చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు.. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేటపాలెం, నగరం ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యు లు ఆందోళనకు దిగారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు కేటాయింపులు పెంచాలని డిమాం డ్ చేస్తూ విశాఖలో అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించలేదని శ్రీసత్యసాయి జిల్లాలో చేపట్టిన ఆందోళనలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల పరిధిలోని మండల కేంద్రాల్లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. కడప అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

# సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ సమావేశం..



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 4: సీఎం చంద్రబాబు నాయుడితోడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈరోజు (బుధవారం) ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు పవన్. అనంతరం ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయాత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం, అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. సిట్ తన నివేదికను కేబినెట్ ముందు ఉంచగా నిన్న (మంగళవారం) ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

# న్యాయదేవత దుఃఖిస్తోంది: సీఎం మమతా బెనర్జీ



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివాదంపై మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన ఆమె.. తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించారు. ఈ క్రమంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'తలుపుల వెనుక న్యాయ దేవత దుఃఖిస్తోంది' అని అన్నారు. సుప్రీంకోర్టులో అయినా తమకు న్యాయం జరగాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు మమత. పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) ప్రక్రియను వ్యతిరేకిస్తూ సీఎం మమతా బెనర్జీ, మోస్తారీ బాను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్లు అన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తన పిటిషన్‌పై స్వయంగా వాదనలు వినిపించిన సీఎం మమతా బెనర్జీ.. ఎన్నికల సంఘాన్ని 'వాట్సాప్ కమిషన్'గా అభివర్ణించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అంతా గందరగోళంగా ఉందని ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలు చూపించినా ఎస్ఐఆర్ అధికారులు అంగీకరించడం లేదని మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరుగనున్న అసోంలో కాకుండా.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్‌ను చేపడుతున్నారంటూ ఈసీ తీరుపై మమతా బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఉన్న అసోంలో ఎందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం లేదని ప్రశ్నించారామె. బీఎల్‌ఓలపై ఒత్తిడి తెచ్చి ఓట్లను తొలగిస్తున్నారని.. ఈ అంశంపై ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో బెంగాల్‌లో వంద మంది చనిపోయారన్నారు. సుప్రీంకోర్టులో అయినా న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు సీఎం. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ప్రజల హక్కులను కాపాడండి' అని సీజేఐకి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. మమత అభ్యర్థనపై స్పందించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది.

# ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్టులపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం: మంత్రి రామానాయుడు ధ్వజం

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలోని నీటి పారుదల రంగం పూర్తిగా గాడి తప్పిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రూ. 18 వేల కోట్ల మేర బకాయిలు పెట్టిందని, దీనివల్ల అనేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. వైసీపీ అనుసరించిన విధానాల వల్ల వ్యవస్థ మొత్తం ధ్వంసమైందని, ఆ అస్తవ్యస్త పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుతో పాటు హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. వీటితో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మరియు పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను వేగవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసినప్పటికీ రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సమృద్ధిగా నీరు నిల్వ ఉండటం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన వాటర్ మేనేజ్‌మెంట్ ఉందని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. నీటి నిల్వలను శాస్త్రీయంగా నిర్వహించడం వల్లనే వర్షాకాలం తర్వాత కూడా జలాశయాలు కళకళలాడుతున్నాయని ఆయన వివరించారు. చుక్క నీటిని కూడా వృధా




చేయకుండా సాగు అవసరాలకు మళ్లించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో నీటి పారుదల రంగాన్ని మళ్ళీ పూర్వవైభవానికి తీసుకురావడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ బకాయిలను పరిష్కరిస్తూనే, కొత్త పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టుల వ్యయం పెరిగిందని, వాటన్నింటినీ అధిగమించి నిర్దేశిత గడువులోగా సాగునీటి ప్రాజెక్టులను ప్రజలకు అంకితం చేస్తామని మంత్రి రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# ద్రోహి నడుచుకుంటూ వెళుతున్నాడని రాహుల్ గాంధీ వ్యాఖ్య



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, మాజీ కాంగ్రెస్ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ప్రాంగణంలో తనను 'దేశద్రోహి' అని సంబోధించిన రాహుల్, ఒక వీధి రౌడీలా ప్రవర్తించారని, తనపై భౌతిక దాడికి కూడా ప్రయత్నించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో పార్లమెంట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.బుధవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం నుంచి వెళ్తున్న సమయంలో సస్పెండైన ఎంపీలతో కలిసి ఉన్న రాహుల్ గాంధీ, తనను చూసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని రవ్‌నీత్ సింగ్ బిట్టు తెలిపారు.అదిగో దేశద్రోహి వెళ్తున్నాడు. అతని ముఖం చూడండి అంటూ రాహుల్ గట్టిగా అరిచారని చెప్పారు. అంతటితో ఆగకుండా హలో సోదరా నా దేశద్రోహి మిత్రమా కంగారు పడకు, నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావులే అని తనతో అన్నారని బిట్టు వివరించారు.రాహుల్ వ్యాఖ్యలకు తాను తీవ్రంగా ప్రతిస్పందించానని బిట్టు తెలిపారు.రాహుల్ ఇంకా ఏదో సంస్థానానికి యువరాజుననే అపోహలో ఉన్నట్టున్నారు. నేను ఆయనతో కరచాలనం చేస్తానని అనుకున్నారు. కానీ నేను, 'రాహుల్ జీ, మీరే ఈ దేశానికి శత్రువు. మీరు సైనికులకు వ్యతిరేకి, పార్లమెంటులో ఎప్పుడూ వారికి వ్యతిరేకంగానే మాట్లాడతారు' అని స్పష్టంగా చెప్పాను అని బిట్టు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనపై భౌతిక దాడికి యత్నించారని బిట్టు ఆరోపించారు.నేను కరచాలనం చేసేందుకు నిరాకరించగానే, రాహుల్ నాపైకి దూసుకొచ్చారు. వెంటనే కేసీ వేణుగోపాల్ అడ్డుకుని ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. వేణుగోపాల్ గనుక అడ్డుకోకపోయి ఉంటే, రాహుల్ నాపై దాడి చేసేవారే. ఒకవేళ దాడి చేసి ఉంటే, నేను కూడా ఊరుకునేవాడిని కాదు అని బిట్టు హెచ్చరించారు. వీధి రౌడీలు కూడా చేయని పనిని రాహుల్ చేశారని ఆయన మండిపడ్డారు.గాంధీ కుటుంబంపై, కాంగ్రెస్ పార్టీపై కూడా బిట్టు తీవ్ర విమర్శలు చేశారు. "సిక్కుల హంతకులైన గాంధీ కుటుంబ వారసుడితో ఒక సర్దార్ ఎప్పటికీ చేయి కలపడు. కాంగ్రెస్ పార్టీ ఎంతో మంది సిక్కులను చంపింది. గురుద్వారాలను ధ్వంసం చేసింది. వారు ఎప్పటికీ మాకు శత్రువులే" అని అన్నారు. తన తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, అయితే ఆయన కీర్తిని చూసి గాంధీ కుటుంబం ఓర్వలేకపోయిందని ఆరోపించారు. పీవీ నరసింహారావు ప్రధాని అయ్యాక గాంధీ కుటుంబ పాలన అంతమైందని, పరిస్థితులు మారాయని గుర్తుచేశారు.ఒక పార్లమెంటేరియన్ అయి ఉండి ఇలాంటి పదజాలం వాడటం, దాడికి యత్నించడం రాహుల్ గాంధీకి తగదని బిట్టు హితవు పలికారు.ప్రస్తుతం నేను ఉన్న బీజేపీలో ప్రధాని మోదీ, అమిత్ షా నాకు ఎంతో గౌరవం ఇస్తున్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేదు. ఈ ఘటన పార్లమెంట్ ఆవరణలో జరగడం వల్లే అసలు విషయం అందరికీ తెలిసింది అని రవ్‌నీత్ సింగ్ బిట్టు వ్యాఖ్యానించారు

# వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సమీక్షించండి.. కేంద్రానికి సుప్రీం సూచన

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** న్యూఢిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుగ్ ఆరోగ్య పరిస్థితిపై సుప్రీంకోర్టు బుధవారంనాడు ఆందోళన వ్యక్తం చేసింది. వాంగ్‌చుక్ నిర్బంధంపై పునఃసమీక్షించాలని కేంద్రానికి సూచించింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని ఆయన హెల్త్ రిపోర్ట్ ద్వారా తెలుస్తోందని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పీబీ వరలేతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'వాంగ్‌చుక్ నిర్బంధం ఆదేశాలు జారీ చేసి సుమారు ఐదు మాసాలు అవుతోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని హెల్త్ రిపోర్ట్ చెబుతోంది. ఇది వయసుకు సంబంధించిన సమస్య కావచ్చు, మరొకటి కావచ్చు. ఆయన నిర్బంధాన్ని కేంద్రం పునఃసమీక్షించే అవకాశం ఉందా?' అని ప్రభుత్వ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనర్ కేఎం నటరాజన్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ఆయన స్పందిస్తూ, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగం ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్లతో గత ఏడాది లెహ్‌లో చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారిందని, దీనికి వాంగ్‌చుక్ బాధ్యులని నటరాజన్ కోర్టుకు తన వాదన వినిపించారు. రెచ్చగొట్టే ప్రసంగాలే ఇందుకు కారణమన్నారు. ఒక



వ్యక్తి నేరుగా అల్లర్లలో పాల్గొనక్కర లేదని, సమూహాన్ని ప్రభావితం చేసినా సరిపోతుందని, అప్పటి హింసాకాండలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, 161 మంది గాయపడ్డారని కోర్టు దృష్టికి తెచ్చారు. హింసాకాండ జరిగిన రెండు రోజులకు సెప్టెంబర్ 26న వాంగ్‌చుక్‌ను నిర్బంధంలోకి తీసుకున్నారు. కాగా, ఈ అంశంపై కోర్టు గురువారంనాడు కూడా విచారణ కొనసాగించనుంది.

# మోదీ ప్రసంగానికి ముందే లోక్‌సభ వాయిదా..



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 04** న్యూఢిల్లీ: విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ రేపటి(గురువారం)కి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు.

మూడుసార్లు వాయిదా బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో సభ బుధవారం నాడు మూడుసార్లు వాయిదా పడింది. తొలుత సభ ప్రారంభం కాగానే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభ వాయిదా పడింది. దీంతో విపక్ష సభ్యులు పార్లమెంటు మెట్ల వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే మళ్లీ గందరగోళం తలెత్తింది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు సభలో సమాధానం ఇస్తానని కేంద్ర మంత్రి పీయూష్ గెయల్ చెప్పడంతో సభ రెండోసారి వాయిదా పడింది. తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగానే పీయూష్ గోయల్ మాట్లాడుతుండగా.. 8 మంది ఎంపీలను సమావేశాల నుంచి బహిష్కరించడంపై స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సాయంత్రం 5 గంటలకు సభ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తిరిగి సభ ప్రారంభమై మోదీ ప్రసంగించాల్సి ఉండగా దీనికి ముందే స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

# సినిమా



## షాకింగ్ విషయం చెప్పిన రవిబాబు

తెలుగు సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు రవిబాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో రవిబాబు తన కెరీర్‌లోని కొన్ని ఆసక్తికర విషయాలను, చేదు అనుభవాలను పంచుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో స్థానిక నటుల కంటే ఇతర భాషల నటులకు ప్రాధాన్యత ఇవ్వడంపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మన నటులు అందుబాటులో ఉన్నా, బయటి నుండి నటులను తీసుకొచ్చి, వారికి తెలుగు డైలాగులు రాక కష్టపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు రవిబాబు. నితిన్ హీరోగా నటించిన విక్టరీ చిత్రంలో తనకు లాయర్ పాత్ర కోసం సురేష్ రెడ్డి అనే వ్యక్తి అడిగారని అప్పుడు జరిగిన ఓ సంఘటనను పంచుకున్నారు రవిబాబు.

నితిన్ హీరోగా, ఆర్ ఆర్ మూవీ మేకర్స్ నిర్మించిన విక్టరీ చిత్రంలో అశుతోష్ రాణా అనే హిందీ నటుడికి ఎక్కువ రెమ్యునరేషన్ ఇస్తున్నారని తెలుసుకుని, రవిబాబు గట్టిగా ప్రశ్నించారట. నాకు తెలుగు వచ్చు, అశుతోష్ రాణాకి తెలుగు రాదు. నా ఇంట్లో నేను ఉంటాను, బిజినెస్ క్లాసులో ఢిల్లీ నుంచో, బాంబే నుంచో రాను. నాకు మేకప్ మేన్, అసిస్టెంట్ లేరు, నా కారు నేను వేసుకొని వస్తాను. ఆంధ్రప్రదేశ్‌లో అతని కంటే 100 రెట్లు ఇమేజ్ నాదే ఎక్కువ అలాంటప్పుడు.. అయినప్పటికీ, తనకంటే అతనికి ఎక్కువ డబ్బులు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారట. తన వాదనకు ఆ నిర్మాత దగ్గర సమాధానం లేదని, అతని కంటే చివరకు లక్ష రూపాయలు ఎక్కువ ఇస్తేనే చేస్తానని చెప్పి, ఆ సినిమా చేశానని రవిబాబు గుర్తు చేసుకున్నారు.

ఇక్కడ చాలా మంది టాలెంటెడ్ నటులు ఉన్నప్పుడు, ఇతర భాషల నుండి తక్కువ అర్హత కలిగిన నటులను ఎందుకు తీసుకువస్తున్నారని అన్నారు రవిబాబు. దీనికి ఉదాహరణగా, లెజెండ్ సినిమాలో అద్భుతమైన విలన్ పాత్ర పోషించిన జగపతి బాబును ప్రస్తావించారు. జగపతి బాబు మంచి ఆర్టిస్ట్ అని రవిబాబు అన్నారు. జగపతి బాబు వంటి తెలుగు నటులు అందుబాటులో ఉన్నా, మలయాళం, తమిళం నుండి విలన్లను ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. రవిబాబు తన లైఫ్ స్టైల్ గురించి మాట్లాడుతూ.. తాను ఇండస్ట్రీలో పెద్దగా ఎవరితోనూ మాట్లాడానని, పబ్లిక్ ప్లేస్‌లకు, ఫంక్షన్లకు వెళ్ళనని చెప్పారు. ఇద్దరు ముగ్గురితో మాత్రమే తన ఇంటరాక్షన్ పరిమితమని తెలిపారు. పెద్ద కమర్షియల్ దర్శకులు తనకు వేషాలు ఇవ్వరని, వారి ఫోన్లు ఎప్పుడూ రాలేదని ఆయన అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. స్వీట్ కార్న్‌లోని పోషక విలువలు, అది డయాబెటిస్‌పై చూపే ప్రభావాల గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

డయాబెటిస్‌పై స్వీట్ కార్న్ ప్రభావం

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ +× స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.

డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది. ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.

అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

ముఖ్యమైన పోషకాలు: విటమిన్  లతో పాటు మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీకి తోడ్పడతాయి.

ప్రతికూల అంశాలు

అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.

ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.

షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ ఎలా తినాలి?

మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం.

ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం.

కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.



## గుండె జబ్బులు ఉన్నవారు బొప్పాయి తినవచ్చా?

తీపి రుచి, విటమిన్లు ఎ, సి, ఇ యాంటీఆక్సిడెంట్లతో నిండిన బొప్పాయిని సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో దీనికి సాటిలేదు. అయితే, ఈ పండు అందరికీ ఆరోగ్యప్రదాయిని కాదని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా గుండె జబ్బులు, థైరాయిడ్ కిడ్నీ సమస్యలు ఉన్నవారు బొప్పాయిని తీసుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.బొప్పాయిని నివారించాల్సిన వారు -- కారణాలు:

గుండె సమస్యలు ఉన్నవారు: బొప్పాయి గుండె దడను తగ్గించే అవకాశం ఉంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఇది ప్రమాదకరంగా మారవచ్చు. ముఖ్యంగా రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు దీనికి దూరంగా ఉండాలి. బొప్పాయిలోని పపైన్ ఈ మందుల ప్రభావాన్ని పెంచి రక్తస్రావం అయ్యేలా చేస్తుంది.

గర్భిణీ స్త్రీలు: పండని లేదా సగం పండిన బొప్పాయిలో లేటెక్స్, పపైన్ అధికంగా ఉంటాయి. ఇవి గర్భాశయ సంకోచాలకు కారణమై అకాల ప్రసవం లేదా ఇతర గర్భధారణ సమస్యలకు దారితీస్తాయి.

థైరాయిడ్ రోగులు: బొప్పాయిని ఎక్కువగా తీసుకోవడం వల్ల థైరాయిడ్ హార్మోన్ స్రావంలో మార్పులు వస్తాయి. మీరు వాడే మందుల శోషణను ఇందులోని ఫైబర్ అడ్డుకుంటుంది, దీనివల్ల అలసట మెటబాలిజం దెబ్బతినే అవకాశం ఉంది.

కిడ్నీలో రాళ్లు ఉన్నవారు: బొప్పాయిలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. అయితే, విటమిన్-సి అతిగా శరీరంలోకి చేరితే అది కాల్షియం ఆక్సలేట్ కిడ్నీ రాళ్లకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లేటెక్స్ అలెర్జీ: రబ్బరు గ్లౌజులు లేదా బెలూన్ల వల్ల అలెర్జీ కలిగే వారు బొప్పాయిని తినకూడదు. దీనిలోని లేటెక్స్ ద్రవం చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలిగించవచ్చు.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. మీకు ఏవైనా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉంటే బొప్పాయిని ఆహారంలో చేర్చుకునే ముందు ఖచ్చితంగా మీ వైద్యుడిని సంప్రదించండి.

## భారత కుర్రాళ్ల విశ్వరూపం..

హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన అండర్-19 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్‌లో భారత్ సంచలన విజయం సాధించింది. అఫ్గానిస్థాన్ నిర్మించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కుర్రాళ్లు ఊపిరి బిగబట్టే ఉత్కంఠ లేకుండా ఛేదించేశారు. ఈ గెలుపుతో భారత్ రికార్డు స్థాయిలో 10వ సారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. అఫ్గాన్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి చరిత్రలోనే భారత్‌పై అత్యధిక స్కోరు సాధించినా, మన బ్యాటర్ల ముందు అది తలవంచక తప్పలేదు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై ఏ జట్టు కూడా ఇంత భారీ స్కోరు చేయలేదు. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలతో కదం తొక్కారు. ఫైసల్ షినోజాదా 93 బంతుల్లో 110 పరుగులు చేయగా, ఉజైరుల్లా నియాజై 86 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేష్ దేవేంద్రన్, కనిష్క చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినా పరుగులు ధారాళంగా సమర్పించుకున్నారు.

311 పరుగుల లక్ష్యం అంటే సామాన్యమైన విషయం కాదు. కానీ భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఈ లక్ష్యాన్ని చాలా చిన్నదిగా చేసేశాడు. కేవలం 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్, మొత్తం 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 68 పరుగులు చేసి అఫ్గాన్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. మొదటి 10 ఓవర్లలోనే భారత్ 91 పరుగులు చేసి అఫ్గానిస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఆరంభంలో వైభవ్ చూపిన వేగం, భారత్‌కు రన్ రేట్ భయం లేకుండా చేసింది.

వైభవ్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఆయుష్ మాత్రే బాధ్యతాయుతంగా ఆడాడు. ఆరోన్ జార్జ్‌తో కలిసి రెండో వికెట్‌కు 114 పరుగులు జోడించాడు. ఆయుష్ 59 బంతుల్లో 62 పరుగులు చేసి వెనుదిరగ్గా, ఆరోన్ జార్జ్ మరోవైపు అఫ్గాన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. క్లాసిక్ షాట్లతో అలరించిన జార్జ్, 104 బంతుల్లో 115 పరుగులు చేసి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశాడు. భారత్ 41.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

ఈ మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది:

హైయెస్ట్ రన్ చేజ్: అండర్-19 వరల్డ్ కప్ నాకౌట్ దశలో ఇదే అతిపెద్ద రన్ చేజ్.

భారత్ ఫైనల్ రికార్డు: ఇప్పటివరకు 10 సార్లు ఫైనల్ చేరిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది.

డబుల్ సెంచరీలు: ఒకే ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు ఇద్దరు సెంచరీలు చేసినా భారత్ గెలవడం ఇదే ప్రథమం.

వైభవ్ వేగం: ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీల్లో ఒకటిగా వైభవ్ ఇన్నింగ్స్ నిలిచింది.

ఫైనల్‌లో ఎవరితో?

సెమీఫైనల్‌లో అఫ్గాన్‌పై ఈ భారీ విజయం ఇచ్చిన ఊపుతో భారత్ ఫైనల్‌కు సిద్ధమవుతోంది. ఎల్లుండి జరగనున్న ఫైనల్‌లో భారత్ తన ప్రత్యర్థి ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఇప్పటివరకు ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు ఆరోసారి కప్పు నెగ్గడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విజయంతో భారత యువ ఆటగాళ్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.




## సూర్య మాస్టర్ ప్లాన్..

టీ20 వరల్డ్ కప్‌కు ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లోనే టీమిండియా మేనేజ్మెంట్ భారీ సర్ ప్రైజ్ ఇచ్చింది. నవీ ముంబై వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే అందరూ ఊహించినట్లుగా కాకుండా ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో పాటు ఇషాన్ కిషన్‌ను పంపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొన్నటి వరకు ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా ఉన్న సంజూ శాంసన్‌ను కాదని.. ఇషాన్ కిషన్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం చూస్తుంటే, వరల్డ్ కప్ ప్రధాన మ్యాచ్‌ల్లో కూడా ఇదే ఫార్ములా కొనసాగుతుందని అర్థమవుతోంది.

ఇషాన్ కిషన్ అదరగొట్టినందుకే ఈ గిఫ్ట్

ఇషాన్ కిషన్‌కు ఈ అవకాశం ఊరికే రాలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఇషాన్ శివతాండవం చేశాడు. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీతో ఏకంగా 215 పరుగులు రాబట్టి ఫామ్ అంటే తనదే అని నిరూపించుకున్నాడు. ఆ సిరీస్ చివరి మ్యాచ్‌లోనే సంజూ నుంచి కీపింగ్ గ్లౌజులు అందుకున్న ఇషాన్, ఇప్పుడు ఓపెనింగ్ స్లాట్‌ను కూడా దక్కించుకున్నాడు. గతేడాది పర్ఫార్మెన్స్ ఆధారంగా చూస్తే, సంజూ కంటే ఇషాన్‌కే మేనేజ్మెంట్ ఓటు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సంజూ శాంసన్ పని అయిపోయినట్లేనా?

వరుసగా వస్తున్న అవకాశాలను చేజార్చుకోవడం సంజూ శాంసన్‌కు శాపంగా మారింది. న్యూజిలాండ్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ సంజూ విఫలం కావడంతో సెలెక్టర్ల ఓపిక నశించినట్లుంది. ఇప్పుడు ఇషాన్ ఓపెనర్‌గా వస్తుండటంతో, మూడో స్థానంలో తిలక్ వర్మ వచ్చే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొని వస్తున్న తిలక్ వర్మకు కూడా ఇది పెద్ద పరీక్షే. ఒకవేళ ఇషాన్, అభిషేక్ జోడీ గనుక వార్మప్ మ్యాచ్‌లో క్లిక్ అయితే, వరల్డ్ కప్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లో సంజూ శాంసన్ బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com